క్లుప్తంగా

పశువైద్యశాలల తనిఖీ



తిరువూరు: తిరువూరు సబ్ డివిజన్‌లోని పశు వైద్యశాలలను ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ గోపీనాథ్ గురువారం తనిఖీలు నిర్వహించారు. తిరువూరు పశువైద్యశాలతో పాటు వావిలాల, నెమలి, సత్యాలపాడు, చింతలపాడు గ్రామీణ పశువైద్యశాలలను సందర్శించి పశువులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులకు అందిస్తున్న చికిత్స, మందుల పంపిణీ, వ్యాక్సినేషన్ తదితర అంశాలను తనిఖీ చేశారు. పశువైద్యులు, సహాయకులకు పలు సూచనలిచ్చారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



తిరువూరు: ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చంద్రయాన్–3 ప్రయోగంపై గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగంలో ప్రత్యేకతలను, ఈ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ వివరించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): వ్యవసాయ రైతులు సాగుచేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి డి.శైలజ కోరారు. పంటల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 15తో ముగుస్తున్నందున రైతులు రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుని గ్రామ వ్యవసాయ అధికారి ద్వారా పంట పొలాల్లో ఫొటో దిగి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అనంతరం ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. పంటల నమోదుతో ధాన్యం కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టానికి బీమా వర్తిస్తుందని, రైతులు త్వరగా తమ పంటల నమోదు చేసుకోవాలని సూచించారు.

గంపలగూడెంలో శాంతిర్యాలీ



గంపలగూడెం: మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం, తోటమూలలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తోటమూల వై–జంక్షన్ నుంచి ప్రారంభించి ర్యాలీ గంపలగూడెం గాంధీసెంటర్ వరకు కొనసాగింది. దేశంలో శాంతి నెలకొల్పాలి, మైనార్టీలపై దాడులను అరికట్టాలి. మణిపూర్ అరాచక వాదులకు కఠిన శిక్షపడాలి తదితర నినాదాలతో కూడిన ప్లకార్డులను చేతబూని ప్రదర్శన జరిపారు. వివిధ క్రైస్తవ సంఘాల ఫాదర్లు ప్రవీణ్‌కుమార్, సుమాన్, బి.మోహన్‌రావు, రాంబాబు, జాన్, విల్సన్, సిస్టర్ స్మిత తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోవాలి

కోకిలంపాడు(తిరువూరురూరల్): రైతులు తాము పండించే పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ డి.మాధవీలత సూచించారు. మండలంలోని కోకిలంపాడులో గురువారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంటీయూ 1061 వరి విత్తనోత్పత్తికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వెదజల్లే వరిలో నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. తిరువూరు ఏడీఏ కెనడీ, ఏవో పద్మ, గ్రామ సర్పంచి లక్ష్మి పాల్గొన్నారు.

28న వీణ, వయోలిన్ వాయిద్య సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన వీణ, వయోలిన్ వాయిద్య సమ్మేళనం నిర్వహిస్తునట్లు సంస్థ కార్యదర్శి సీవీరావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో వీణ విద్వాంసుడు చిట్టా కార్తీక్, యువ వయోలిన్ కళాకారిణి గాయత్రి విభావరి కచేరి నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలలకు నూతన సొబగులు

చంద్రాల(మైలవరం): నాడు–నేడు పనులతో పాఠశాలలు నూతన సొబగులు దిద్దుకుంటున్నాయి. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా బెంచీలు, బోర్డులు, విద్యుత్ ఏర్పాటు, ఆధునిక వసతులతో తరగతి గదులు, టాయ్‌లెట్లు, వాటర్ ట్యాంక్‌లు, టాయ్‌లెట్స్‌కు నీటి సదుపాయం కల్పిస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలో 184 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 14,330 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటి వరకు 90 పాఠశాలల్లో నాడు–నేడు నిధులతో ఆధునిక వసుతలు ప్రభుత్వం కల్పించింది. మైలవరం మండలం చంద్రాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా ఆధునిక వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.67,57,363 మంజూరు చేసింది. ఇందులో రూ.32,69,721తో బ్లాక్ బోర్డులు, బెంచీలు, శానిటరీ సామానులు, రంగులు, ఎలక్ట్రికల్ సామాను, ఫ్యాన్లు తదితర మెటీరియల్ అందజేసింది. మిగిలిన సొమ్మును ప్రధానోపాధ్యాయుని ఖాతాకు జమ చేసింది. ఈ సొమ్మును ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల యాజమాన్యంతో కలిసి సిమెంట్, ఇసుక, గ్రానైట్ రాళ్లు, టైల్స్ తదితరాల కొనుగోలుకు, కూలీలకు రోజు వారి వేతనానికి వినియోగించినట్లు హెచ్‌ఎం వరదా శ్రీనివాసరావు తెలిపారు. రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.



చంద్రాల పాఠశాలలో టాయ్‌లెట్స్ పనులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

ప్రభుత్వ పాఠశాలల పనితీరు బాగుంది

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆధునిక హంగులు సంతరించుకుంటున్నాయి. విద్యార్థులకు ట్యాబ్‌లు, యూనిఫామ్, షూస్, పుస్తకాలు అన్నీ అందజేస్తున్నారు. విద్యా బోధన కూడా చాలా బాగుంది.

– తాడిశెట్టి జమలయ్య, విద్యార్థి తండ్రి, చంద్రాల

విద్యార్థులను చైతన్య పరచేందుకు కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. నాడు–నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోతున్నాయి. దానికి తగినట్లుగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠాలు బోధిస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా అందజేస్తున్నాం. తాగునీటి వసతి, టాయ్‌లెట్స్‌లో నీరు ఏర్పాటు చేస్తున్నాం.

– వరదా శ్రీనివాసరావు, హెచ్‌ఎం, చంద్రాల జెడ్పీహెచ్ స్కూల్

సీసీ రహదారుల పనులు పరిశీలన

ఎ.కొండూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కె. రక్షణనిధి అన్నారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో ఇటీవల నూతనంగా వేసిన సీసీ రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో వేసిన సీసీ రహదారి పనులు పర్యవేక్షించామని, నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రహదారులకు ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యం కూడా కల్పించి మురుగునీరు పారే విధంగా చేయించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల సీసీ రహదారులు వేయిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోట పుల్లారావు, మాజీ సర్పంచ్ సతీష్, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, అధికారులు పాల్గొన్నారు.



కంభంపాడులో పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కె. రక్షణనిధి

నేడు గ్రామ దేవతలకు శ్రావణ పట్టీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కొలువై ఉన్న గ్రామదేవతలకు శుక్రవారం శ్రావణ పట్టీ (చీర, పసుపు, కుంకుమ, పూలదండలు) ఇస్తామని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం తెలిపారు. తొలుత శుక్రవారం దేవతలకు అలంకరణ ఆనవాయితీగా ఉన్న పెనుగంచిప్రోలులో తూర్పు బజారు. యాదవ బజారు, కొళ్లికూళ్లలో ముత్యాలమ్మకు, కొణకంచిలో అంకమ్మ, ముత్యాలమ్మ, రాట్నాలమ్మవారు, లింగగూడెం, ముచ్చింతాల, శనగపాడు, వెంకటాపురం, వెంగనాయకునిపాలెంలో ముత్యాలమ్మవారికి శ్రావణ పట్టీ ఇస్తామని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం నుంచి ప్రచార రథం ద్వారా ఊరేగింపుగా ఆయా గ్రామాలకు శ్రావణ పట్టీని తీసుకెళ్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పెనుగంచిప్రోలు మండలం తరువాత జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే రక్షణనిధి వినతి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి జిల్లా కలెక్టరు ఢిల్లీరావును కోరారు. విజయవాడలో గురువారం కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరుపై వంతెన పునర్నిర్మాణానికి నిధుల మంజూరు, ఇటీవల భారీవర్షాలకు దెబ్బతిన్న రహదారులకు అత్యవసర మరమ్మతులు, గ్రామీణ రహదారుల అభివృద్ధి తదితర పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వాసవి ఫార్మా ఫీడర్, 11 కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ట్రిబుల్ ఎస్ కాలనీ ఏరియా, వస్త్రలత కాలనీ ఏరియా, రాధామాధవ టింబర్ డిపో ఏరియా, మధుసూదన టింబర్ డిపో ఏరియా, హెడ్ పోస్టాఫీస్ ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందితో సహకరించాలని కోరారు.

నేడు తిరుపతమ్మకు వజ్రకిరీటం అలంకరణ

పెనుగంచిప్రోలు: భక్తుల కోరిక మేరకు గ్రామంలో వేంచేసిన శ్రీతిరుపతమ్మ అమ్మవారికి శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వజ్ర కిరీటాన్ని అలంకరిస్తామని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం తెలిపారు. నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ ఎనిమిదో తేదీన కూడా ఈ కిరీటాన్ని అలంకరిస్తామని పేర్కొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పాడుగు శివరామకృష్ణ కుటుంబసభ్యులు రూ.20,116 విరాళాన్ని సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ ధర్మకర్త కోలా రామారావు చేతుల మీదుగా అందజేశారు.



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు

ఇబ్రహీంపట్నం: ఎంపీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి తద్వారా మండల పరిషత్‌కు ఆదాయ వనరులు సమకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. కేతనకొండ గ్రామ క్లస్టర్‌లో సచివాలయాన్ని కొటికలపూడి గ్రామానికి కేటాయింపు, కేతనకొండ ఎంపీపీ పాఠశాల కాచవరంగా కొనసాగడంతో దాని పేరును కూడా కేతనకొండగా మార్చుచేయాలని తీర్మానం చేశారు. అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు వినిపించారు. ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న

డీపీఆర్టీయూ సభ్యత్వ నమోదు



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): డెమొక్రటిక్ పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో గురువారం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయనకు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. డీపీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎండీ ఇర్ఫాన్ పాషా, నాయకులు డేవిడ్‌రాజు, మధుకిరణ్, తదతరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయవంతంపై హర్షం

నూజివీడు: చంద్రయాన్–3 విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులు గురువారం హైస్కూల్ గ్రౌండ్‌లో ఇస్రో ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. ఇస్రో పంపిన ల్యాండర్ 41 రోజుల సుదీర్ఘ ప్రయాణం తరువాత చంద్రునిపై విజయవంతంగా కాలు మోపినందుకు ఉపాధ్యాయులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం దుర్గామల్లేశ్వరి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశం చేయలేని పనిని చంద్రుని దక్షిణ ధృవంపై ల్యాండర్‌ను దించి తన సత్తాను ప్రపంచ దేశాలకు భారత దేశం చాటిందన్నారు.

వాహనాలకు అవరోధంగా పశువులు

మైలవరం: మైలవరంలోని ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు పశువులు అవరోధంగా మారాయి. మైలవరంలోని నూజివీడు రోడ్డులో పలు వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ రహదారి ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు వినియోగదారులతో బిజీగా ఉంటుంది. మైలవరం–నూజివీడు ఆర్టీసీ బస్‌లు కూడా ఈ రోడ్డు నుంచే వెళతాయి. ఈ రోడ్డులో పశువులు యథేచ్ఛగా తిరుగుతూ వాహనాల రాకపోకలకు అడ్డుపడుతున్నాయి. దీంతో ఇటు వ్యాపారస్తులు, అటు వాహన చోదకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని నూజివీడు రోడ్డులోని వ్యాపారస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.



మైలవరం–నూజివీడు రహదారిలో రోడ్డుకు అడ్డంగా నిలిచిన పశువులు

హెచ్‌సీయూలో సీటు సాధించిన మైలవరం విద్యార్థిని

మైలవరం: మైలవరానికి చెందిన విద్యార్థినికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు లభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)లో ప్రతిభ కనబర్చి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో మైలవరం విద్యార్థిని టీఎస్‌ఎస్‌ఎస్ లక్ష్మి లాంగ్వేజ్ సైన్స్ కోర్సులో అడ్మిషన్ పొందినట్లు తల్లిదండ్రులు టి. నాగచండీ ప్రసాద్, పుష్పకుమారి గురువారం తెలిపారు.



హెచ్‌సీయూలో సీటు సాధించిన లక్ష్మి

రేపు నందిగామలో న్యాయసేవా శిబిరం

నందిగామ: నూతన తరహా న్యాయ సేవా శిబిరాన్ని విజయవంతం చేయాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ నందిగామ నెహ్రూనగర్‌లో ఉన్న కమ్మ కల్యాణ మండప ఆవరణలో ఈ నెల 26వ తేదీన నూతన తరహా న్యాయ సేవా శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో న్యాయ సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఏవైనా ఫిర్యాదులు చెయ్యాలనుకునే వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

పేద వైద్యవిద్యార్థినికి ఆర్థికసాయం

తిరువూరు: తెలంగాణ వైద్య విశ్వవిద్యాలయం ద్వారా ఈ ఏడాది ఎంబీబీఎస్ సీటు సాధించిన మోదుగు సాధన అనే విద్యార్థినికి ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి, పేదరికాన్ని ఎదిరించి ఎంబీబీఎస్ సీటు సాధించిన ఖమ్మం జిల్లా గుంటుపల్లి గోపవరానికి చెందిన సాధనకు స్థానిక నాగార్జున జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దాతల సహకారంతో రూ.17వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాంప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సాధనకు ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతమ్మ సేవలో అరుణాచలం స్వామీజీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మను తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం రుద్రాక్షస్వామి తన శిష్యబృందంతో కలిసి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరుణాచలం వచ్చే భక్తులకు వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు భవన నిర్మాణం కోసం ధర్మ ప్రచారంలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వామకుంట్ల పీఠాధిపతి రామడుగు నరసింహాచార్యులు, కల్లూరి శ్రీవాణి, సమసరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మిస్టర్ ప్రెగ్నెంట్ చిత్ర యూనిట్ సందడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మిస్టర్ ప్రెగ్నెంట్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర విజయోత్సవంలో భాగంగా గవర్నర్‌పేట హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు సోహెల్ మాట్లాడుతూ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. మహిళలు 9 నెలల గర్భం సమయంలో పడే బాధని ఈ చిత్రం ద్వారా చూపించామన్నారు. మంచి సినిమాలను విజయవాడ ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారని ఈ చిత్రంతో మరోసారి రుజువైందన్నారు. త్వరలో బూత్ కట్ బాలరాజు చిత్రంతో ప్రేక్షకులు ముందుకు రానున్నట్లు తెలిపారు. అనంతరం దర్శకుడు శ్రీనివాస్ వింజనంపాటి, నిర్మాత అప్పిరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని విజయవాడ ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని చెప్పారు. ఒక గొప్పదైన కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చామని పేర్కొన్నారు.

జస్టిస్ శేషసాయిని కలిసిన నందిగామ న్యాయవాదులు

నందిగామ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి కృష్ణాజిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ ఎ.వి.శేషసాయిని నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కలిశారు. న్యాయస్థానంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన న్యాయవాదులు జస్టిస్ శేషసాయిని సత్కరించారు. నందిగామలో కోర్టు భవనాల నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో పట్టణంలోని జిల్లా 16 వ అదనపు కోర్టును నూతన భవన సముదాయంలోకి మార్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బండి మల్లికార్జునరావు, పి.ప్రకాష్, ఏపీపీ ఈశ్వర ప్రగడ రంగారావు, న్యాయవాదులు మన్యం నారాయణరావు, కొనకంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జస్టిస్ శేషసాయిని సత్కరిస్తున్న న్యాయవాదులు

గ్రామీణ నేపథ్య చిత్రం ప్రేమ దేశపు యువరాణి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒక అందమైన ప్రేమకథను ప్రేక్షకులకు సరికొత్తగా చూపించే చిత్రమే ప్రేమదేశపు యువరాణి అని ఆ సినిమా హీరో యమిన్‌రాజ్ అన్నారు. సెప్టెంబరు 2న విడుదల కానున్న ప్రేమదేశపు యువరాణి చిత్ర యూనిట్ సభ్యులు ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్‌లోని ఓ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యమిన్‌రాజ్ మాట్లాడుతూ తాను విజయవాడలో పుట్టి పెరిగానని, సినిమాలంటే ఎంతో ఇష్టమన్నారు. యాక్టింగ్ నేర్చుకుని ప్రేమదేశపు యువరాణి చిత్రంలో నటుడిగా వెండితెరకు పరిచయం అవుతున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నుంచి తమ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ ప్రియాంక రెవిరీ మాట్లాడుతూ ఒక అందమైన యువతి పాత్రలో ఈ చిత్రంలో నటించానని, తన పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు నిమ్మల సాయిసునీల్ మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ఈ చిత్రాన్ని తీశామని, ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నటులు రాజారెడ్డి, పవన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరో యమిన్‌రాజ్, పక్కన హీరోయిన్ ప్రియాంక రెవిరీ, దర్శకుడు సాయిసునీల్

సెప్టెంబర్ 14న మాదిగల రాజకీయ చైతన్య సదస్సు

నూజివీడు: ప్రస్తుత వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కలపాల సురేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాది ప్రసాదరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఏలూరు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు ఇందుపల్లి తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాబోయే ఎన్నికల్లో మాదిగలకు 21 అసెంబ్లీ సీట్లు, 4 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను వేరు చేసిన విధంగానే ఎస్సీ కమిషన్‌ను వేరు చేసి మాదిగ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కురుక్షేత్ర సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై పెట్టిన పోలీసు కేసులు ఎత్తివేయాలని, మాదిగ, రెల్లి, మాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 14న నూజివీడు అమర్ భవన్‌లో జరగబోయే మాదిగల రాజకీయ చైతన్య ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గరబాప విజయ్‌కుమార్, నూజివీడు పట్టణ అధ్యక్షుడిగా మిసపట్ల రాజేష్, పట్టణ ఉపాధ్యక్షుడిగా బొడ్డు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శిగా చాలపాటి నాగేశ్వరరావు, ఆగిరిపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా పులపాక మాణిక్యాలరావును నియమించారు.